క్లుప్తంగా

రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకుడిని అభినందిస్తున్న తహసీల్దార్ సూర్య నారాయణరెడ్డి

కమలాపురం: రక్త కొరత లేని సమాజాన్ని నిర్మిద్దామని మండల తహసీల్దార్ సూర్య నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక శ్రీ లక్ష్మీదుర్గ డ్రైవింగ్ స్కూల్‌లో మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ జూటూరు విజయ్ ఆధ్వర్యంలో, బోగా బ్లడ్ బ్యాంక్ పర్యవేక్షణలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానం చేసిన యువకులను ఆయన అభినందించారు. ట్రస్ట్ ఛైర్మన్ విజయ్, వీఆర్‌ఓ జయరాజు, ట్రస్ట్ సభ్యులు శ్రీకాంత్, విల్సన్, రమేష్, సంతోష్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

23న వాహనాల వేలం

జమ్మలమడుగు రూరల్: ఈ నెల 23వ తేదీన వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నామని జమ్మలమడుగు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కె.ఎస్. లత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్, ఏదైనా ధ్రువీకరణ పత్రం తీసుకుని వచ్చి వేలంలో పాల్గొనాలని ఆమె తెలిపారు.

పదిలో వచ్చిన మార్కులే భవిష్యత్‌కు పునాది



మాట్లాడుతున్న సీఐ మంజునాథ్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ప్రతి విద్యార్థికి పదవ తరగతిలో వచ్చిన మార్కులే భవిష్యత్‌కు పూనాది అని అందుకే విద్యార్థులందరు బాగా అవగాహనతో ఇష్టపడి చదవాలని యర్రగుంట్ల పట్టణ సీఐ మంజునాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా సీఐ మంజునాథ్‌రెడ్డి, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

సింహాద్రిపురం : గ్రామాల్లో దోమల నివారణకు డీడీటీ పిచికారి చేస్తున్నట్లు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య పేర్కొన్నారు. సోమవారం కోవరంగుంటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని దుద్దేకుంట గ్రామంలో దోమల నివారణకు డీడీటీ పిచికారి చేసి ఫీవర్, లార్వాల సర్వే నిర్వహించి నీటి నిల్వలు ఉన్న నీటి తొట్లలో అబేట్‌ను పిచికారి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఖలీల్ బాషా, ఆశా కార్యకర్త కళ్యాణి పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది సంబరాలు

సింహాద్రిపురం : మండల పరిధిలోని కోవరంగుంటపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం హెడ్మాస్టర్ నాగేంద్ర ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ముందస్తు ఉగాది సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలలో గణపతి పూజ, సరస్వతి, కలశ పూజలను నిర్వహించారు. హెడ్మాస్టర్ నాగేంద్ర ఉగాది పండుగ విశిష్టతను వివరిస్తూ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులందరికి ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, ప్రశాంతి, ప్రశాంతి, లక్ష్మి, గౌరి, జ్యోతి, అంజలి, సుబ్బారాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

కమలాపురం: పరిసరాలు పరిశుభ్రత పాటిస్తే మనం దోమకాటు నుంచి రక్షణ పొందుతామని మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగలక్ష్మీరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని రామ్ నగర్‌లో పర్యటించారు. దోమ కాటు వలన వచ్చే రోగాల గురించి కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పించారు. రాత్రి పూట దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలన్నారు. ఇంటి చుట్టూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. జ్వరాలు వస్తే ఆసుపత్రికి వెళ్లి పరీక్ష చేయించుకోవాలని సూచించారు.

మహా ప్రవక్త మార్గంలో పయనించాలి

చెన్నూరు : మహా ప్రవక్త చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని, ఇదే పవిత్ర ఖురాన్ సందేశమని చెన్నూరు మండల మైనార్టీ ప్రముఖులు తెలిపారు. సోమవారం స్థానిక మదరసలో పవిత్ర ఖురాన్ చదివే విద్యార్థులకు రంజాన్ మాసం రాకను పురస్కరించుకుని ఆధ్యాత్మిక అంశాలపై పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మైనార్టీ నేతలు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల ముస్లిం విద్యార్థులకు మదరసాలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో గంటపాటు పవిత్ర ఖురాన్ విశిష్టత గురువులు తెలియజేస్తారన్నారు.

నష్టపరిహారం అందించేందుకు కృషి

- ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె: మండలంలో గాలీ వానకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం తంగెడుపల్లె గ్రామంలో దెబ్బ తిన్న పంటలను ఆయన పరిశీలించారు. పంటలు చేతికొచ్చే సమయంలో గాలీవానతో పూర్తి స్థాయిలో నష్ట పోయామని పలువురు రైతులు కన్నీరు పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శనివారం సాయంత్రం జరిగిన నష్టాన్ని చాలా మంది రైతులు ఫోన్ ద్వారా తెలియజేశారని తెలిపారు.

అసెంబ్లీ సమావేశాల నిమిత్తం విజయవాడలో ఉండటంతో వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానన్నారు. దీనిపై ఆయన వెంటనే స్పందించి నష్ట పరిహారాన్ని అంచనా వేయాలని జిల్లా కలెక్టరుకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఏ రైతు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా కల్పించారు. పార్టీలకు అతీతంగా న్యాయం చేయాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయమని, పంట నష్ట పోయిన ప్రతి రైతును గుర్తించాలని అధికారులను ఆదేశించారు. వ్యవ సాయ శాఖ జేడీఏ మాట్లాడుతూ ఇప్పటికే ప్రాథమిక అంచనా వేశామని, త్వరలో పూర్తి స్థాయిలో అంచనా వేసి సామాజిక తనిఖీ నిమిత్తం ఈ నెల 30వ తేదీ రైతు భరోసా కేంద్రంలో జాబితాను ప్రదర్శిస్తామని, ఏవైనా తప్పులు ఉంటే రైతులు తెలియజేస్తే వాటిని సరిదిద్దుతామన్నారు.

- ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, పౌరసరఫరాల డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, , మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, హార్టికల్చర్ డీడీహెచ్ సుభాషిని, మండల హార్టికల్చర్ అధికారి రెడ్డెయ్య, కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి, తహసిల్దార్ ఉదయభారతి, మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు వీరభద్రారెడ్డి , వైఎస్సార్ సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

బాల్య వివాహాలు నేరం



పులివెందుల టౌన్ : మాట్లాడుతున్న ఎంఈఓ వీరారెడ్డి

పులివెందుల టౌన్ : బాల్య వివాహాలను నిర్మూలించాలని ఎంఈఓ వీరారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్)లో ప్రభుత్వ ఆదేశాల మేరకు బాల్య వివాహాల నిర్మూలనకు బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ వీరారెడ్డి, దంత వైద్యురాలు హిమబిందు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎంఈఓ వీరారెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని.. వివాహ వయస్సు కనీసం 18ఏళ్లు పూర్తి కావాలి.. ఆ లోపు వివాహాలన్నీ బాల్య వివాహాలేనని పేర్కొన్నారు. దంత వైద్యురాలు హిమబిందు మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని.. మంచి ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన సూచనలను తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థినులతో బాల్య వివాహాల నివారణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ ప్రభాకర్, సేవా సమితి అధ్యక్షుడు రాజు, ఉపాధ్యాయులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

చక్రాయపేట: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ట్రిపుల్ ఐటి ఎస్ఎస్ఎస్ యూనిట్-3 అధికారి విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు.సోమవారం మండలంలోని చెరువు కాంపల్లె గ్రామంలో విద్యార్థులు పారిశుధ్య చర్యలు చేట్టారు. అనంతరం వీధుల్లో బ్లీచింగ్ చల్లారు. అనంతరం బాల్య వివాహాలపై ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులకు బాల్య వివాహాలు, ఆరోగ్యం తదితరాలపై అవగాహన కల్పించినట్లు విశ్వనాథరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు వాలంటీరు గంగాధర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

చెన్నూరు : చెన్నూరు మండలంలో అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడంతో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు, వ్యవసాయాధికారులు మండల వ్యాప్తంగా పర్యటించి ఏయే పంటలకు నష్టం వాటిల్లిందో పరిశీలించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ ముదిరెడ్డి దిలీప్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్‌లు మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా మండలంలోని బయనపల్లె, దౌలతాపురం, గుర్రంపాడు గ్రామాలలో నూగు పంటకు నష్టం వాటిల్లిందని తెలియజేశారు. 40 ఎకరాలలో నువ్వు పంటకు నష్టం జరిగినట్లుగా వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. గుర్రంపాడు, రాచిన్నాయపల్లెలో వేసిన 39 ఎకరాలలో దోసపంటకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అడ్వయిజర్ మెంబర్ ఎర్రసాని మోహన్‌రెడ్డి, బయనపల్లి సర్పంచ్ తుంగ చంద్రశేఖర్ యాదవ్, మండల వ్యవసాయ అడ్వయిజర్‌బోర్డు మెంబర్ వెంకట సుబ్బారెడ్డితోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

ముద్దనూరు: గత రెండురోజుల క్రితం వీచిన తీవ్ర గాలులు, వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు సోమవారం పరిశీలించారు. మండలంలో అరటి, బొప్పాయి, జొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని దేనేపల్లె, ఆరవేటిపల్లె, బొందలకుంట గ్రామాల్లో దెబ్బతిన్న పంట నష్టాన్ని స్థానిక డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకట సుబ్బయ్య, మండల వ్యవసాయాధికారి వెంకట కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మండలంలో వర్షంతో నష్టపోయిన పంటలపై అంచనా వేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. మండలంలో సుమారు 340 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు ఏఓ తెలిపారు.

పెద్దముడియం: రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, వ్యవసాయాధికారి ఓబులేసు ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న, ప్రొద్దుతిరుగుడు, మినుము, నువ్వు పంటలు మండల వ్యాప్తంగా 620 ఎకరాలలో దెబ్బతిన్నాయని, నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.



చెన్నూరు: దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు



ముద్దనూరు: దెబ్బతిన్న బొప్పాయి తోటను పరిశీలిస్తున్న ఏడీఏ, ఏఓ, మాజీ ఎంపీపీ

వైభవంగా జ్యోతి ఉత్సవాలు



గ్రామోత్సవంలో జ్యోతుల ప్రదర్శన



పులి వాహనంపై కొలువుదీరిన చౌడేశ్వరీ దేవి

వల్లూరు: మండలంలోని దుగ్గాయపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలను సోమవారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారు జామున అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి, గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. శ్రీ చౌడేశ్వరీదేవి పులి వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించబడిన పల్లకిలో అమ్మవారి గ్రామోత్సవం అత్యంత ఘనంగా సాగింది. భక్తులు జ్యోతులను తలపై పెట్టుకుని చేసిన వివిధ విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మహిళలు బోనపు కడవలను తలపై పెట్టుకుని అమ్మవారి వెంట తిరిగారు. గ్రామదేవత ఎదుట ఉదయం జ్యోతులను ఆర్పే కార్యక్రమం సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. ఖడ్గ పద్యాలతో, కత్తి సాములతో కార్యక్రమాన్ని పూర్తి చేశారు. వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరి ఉత్సవాల్లో పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయండి

- శిల్పారామ ఏఓ సుధాకర్

పులివెందుల టౌన్ : శిల్పారామంలో ఉగాది పండుగను పురస్కరించుకుని నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని శిల్పారామ పరిపాలనాధికారి సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక శిల్పారామంలో ఉగాది పండుగ, పారువేట, శ్రీరామనవమి పండుగల సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల పోస్టర్లను శిల్పారామ సిబ్బందితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన ఉగాది పండుగను పురస్కరించుకుని సోమేపల్లె వెంకటేశ్వరశర్మచే తెలుగు సంవత్సర ఉగాది పంచాంగ పఠనం, అనంతరం యువరాజు డ్యాన్సింగ్ చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 23వ తేదీన విజయవాడ ఎక్సలెంట్ ఇన్‌స్టిట్యూట్ నాగార్జున స్కూలు ఆధ్వర్యంలో పులివెందుల చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 30వ తేదీన శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని హైకోర్టు అడ్వకేట్ రవీంద్రనాథ్ సౌజన్యంతో కడపకు చెందిన ఎస్ఎస్ఎల్ డ్యాన్స్ స్టూడియో చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



సాంస్కృతిక కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఓ సుధాకర్, తదితరులు

శ్రీ ఏరువాక గంగమ్మ ఆలయంలో పూజలు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని శాంతినగర్ కాలనీలో వెలసిన శ్రీ ఏరువాక గంగమ్మతల్లి ఆలయంలో సోమవారం సంప్రోక్షణ కార్యక్రమం (శాంతిపూజ) వైభవంగా నిర్వహించారు. ఈ శాంతి పూజలో ఆలయ సేవా సమితి కమిటీ సభ్యులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ఆవుల పబ్బం కార్యక్రమంను నిర్వహిస్తున్నారు. అందుకు ముందుగానే ఆలయంలో అమ్మవారికి శాంతి పూజ కార్యక్రమాన్ని వేద పండితుల మధ్య ఘనంగా జరిపించారు.



లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం


పులివెందుల టౌన్ : ప్రైవేట్ ఆసుపత్రులలోని స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేయడం చట్ట ప్రకారం నేరమని వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా అధికారిణి శాంతికళ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాలులో ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్లకు హెచ్‌ఎంఐఎస్, ఐహెచ్‌ఐపీ, ఐరాడ్, సీఆర్‌ఎస్, పీసీఅండ్‌పీఎన్‌డీటీసీ యాక్ట్, ఫాం రిపోర్టింగ్ సిస్టం మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాంతికళ హాజరై మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులన్నీ కూడా హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం పోర్టల్‌లో డేటా పొందుపరచాలన్నారు. అలాగే ప్రైవేట్ ఆసుపత్రులలో నమోదయ్యే డెంగీ, మలేరియా, టీబీ కేసులను నమోదు చేసి ఐహెచ్‌ఐపీ పోర్టల్‌లో పొందుపరచాలన్నారు. అలాగే ప్రైవేట్ ఆసుపత్రులలో కూడా జనన, మరణాల నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జనన, మరణ డేటా ప్రాసెసింగ్ అసిస్టెంట్ కీర్తి, జిల్లా డిప్యూటీ డెమో అధికారిణి రమణమ్మ, ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్స్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాంతికళ

వాటర్ ప్లాంట్ ప్రారంభం

చక్రాయపేట: వాటర్ ప్లాంట్‌ను వైఎస్ఆర్‌సీపీ నేతలు సోమవారం ప్రారంభించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే జగనన్న ప్రభుత్వ ధ్యేయం అని వైఎస్ఆర్‌సీపీ నేతలు పేర్కొన్నారు. మండలంలోని గొంది, చక్రాయపేట, కాట్లగంటి వారిపల్లె, మారెళ్లమడకల్లో పాడా నిధులతో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్లను ఆయా గ్రామాల సర్పంచులు శోభారాణి, హర్షద్, నాగరత్నమ్మ, నరసింహులు, ఎంపీటీసీ సభ్యులు వర్ధనా కిరణ్ రెడ్డి, లీలావతి, గఫూర్, శాంతమ్మల చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో మండల సమన్వయకర్త ఓబుళ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు గౌసలాదం, సింగిల్ విండో అధ్యక్షుడు శేషారెడ్డి, పార్టీ నేతలు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ, పార్టీ నేతలు